సైన్స్ అవార్డుల రద్దు శాస్త్ర పురోగతికి అడ్డు

జెవివి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మురళీధర్

ప్రజాశక్తి - నరసన్నపేట

సైన్స్ అవార్డులను రద్దు చేయడం శాస్త్ర పురోగతికి అడ్డుకట్ట వేయడమేనని జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మురళీధర్ అన్నారు. శాస్త్ర, సాంకేతిక మంత్రిత్వశాఖ ఆదేశాల మేరకు సైన్స్, హెల్త్‌రంగాల్లో అవార్డులను నిలిపివేయాలని ఇండియన్ నేషనల్ సైన్స్ అకాడమీ తీసుకున్న నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. నరసన్నపేటలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ఉర్లాంలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలను గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూఢ నమ్మకాల్లేని శాస్త్రీయ సమాజం దేశాభివృద్ధికి అవసరమన్నారు. యువ శాస్త్రవేత్తలకు, అంతర్జాతీయ హోదా కలిగిన శాస్త్రవేత్తలకు, సైన్స్ టీచర్లకు ఇచ్చే 72 అవార్డులను రద్దు చేయడమంటే వారు తమ రంగాల్లో చేసిన కృషికి కనీస గుర్తింపు లేకుండా అవమానించడమేనన్నారు. ఇలాంటి చర్యల ద్వారా శాస్త్రీయ సంస్థల స్వయం ప్రతిపత్తిని లాగేసుకొని తాము చెప్పినట్లు వినే కీలుబొమ్మని చేయాలనేదే కేంద్ర ప్రభుతం ఆలోచన అని విమర్శించారు. బడ్జెట్లో శాస్త్ర సాంకేతిక రంగాలకు నిధుల కోత పెడుతోందన్నారు. పాఠ్యాంశాల్లో డార్విన్ జీవ పరిణామ సిద్ధాంతాన్ని, పీరియాడిక్ టేబుల్ లాంటి అంశాలను తొలగించడం విద్యార్థులకు శాస్త్రీయ అంశాలను తెలియజేయకూడదనేది పాలకుల భావన అని అన్నారు. అశాస్త్రీయ అంశాలైన జ్యోతిష్యం, వాస్తు అంశాలను పాఠ్యాంశాల్లో చొప్పించడం తిరోగమన చర్యకు నిదర్శనమన్నారు. ఇటువంటి చర్యలను మేధావులు, శాస్త్రవేత్తలు, శాస్త్ర ప్రచార సంస్థలు ఖండించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో జెవివి జిల్లా ఉపాధ్యక్షులు పి.కూర్మారావు, ప్రధానోపాధ్యాయులు పి.వెంకటరావు, హర్షవర్ధన్ శర్మ, జెవివి నాయకులు సాయి శ్రీనివాస్, డి.లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జెవివి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మురళీధర్

సంఘీభావం తెలుపుతున్న సిఐటియు నాయకులు

వారిని సిఆర్‌టిలుగా నియమించాలి

- గెస్ట్ ఫ్యాకల్టీ పోరాటానికి మద్దతు
- సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

కెజిబివిల్లో గెస్ట్ ఫ్యాకల్టీగా పనిచేస్తున్న పిఆర్‌టి, పిజిటిలను సిఆర్‌టిలుగా నియమించాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు, ఉపాధ్యక్షులు ఎం.ఆదినారాయణమూర్తి, కోశాధికారి అల్లు సత్యనారాయణ డిమాండ్ చేశారు. నగరంలోని సమగ్ర శిక్ష జిల్లా కార్యాలయం వద్ద గెస్ట్ ఫ్యాకల్టీ గురువారం నిర్వహిచిన ధర్నాకు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గెస్ట్ ఫ్యాకల్టీ చేపడుతున్న పోరాటానికి సిఐటియు మద్దతుగా నిలుస్తుందని భరోసానిచ్చారు. కెజిబివిల్లో పనిచేసిన తాత్కాలిక ఉపాధ్యాయినులకు అన్యాయం చేయడంతోనే ఆందోళన చేపట్టాల్సి వచ్చిందని తెలిపారు.

ఎనిమిది నుంచి 12 ఏళ్లుగా పనిచేస్తున్న వారికి నూతన నియామకాల్లో ప్రాధాన్యం ఇవ్వకుండా అధికారులు తీవ్ర అన్యాయం చేశారని విమర్శించారు. గతంలో నియమించిన సమయంలో డెమోలు తీసుకుని పూర్తిస్థాయి అర్హతలు చూసే ఉద్యోగాలిచ్చారని, ఇప్పుడు మార్కుల కేటాయింపులో వివక్ష చూపారని చెప్పారు. ప్రస్తుత నియామకాల్లో ఏడాదికి రెండు మార్కులైనా కేటాయిస్తారని ఆశిస్తే, అర మార్కు మాత్రమే కలిపారని తెలిపారు. వయసునూ పరిగణనలోకి తీసుకోలేదన్నారు. తప్పుడు మార్కులు నమోదు చేసిన వారు చాలామంది ఉన్నారని, వాటిని నిశితంగా పరిశీలించాలని డిమాండ్ చేశారు. న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తామని స్పష్టం చేశారు.

26 నుంచి పది, ఇంటర్ సార్వత్రిక పరీక్షలు

కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

ప్రజాశక్తి - శ్రీకాకుళం

ఈనెల 26 నుంచి జూలై నాలుగో తేదీ వరకు పదో తరగతి, ఇంటర్మీడియట్ సార్వత్రిక పరీక్షలను పకడ్బందీగా నిర్వహించనున్నట్లు కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ తెలిపారు. ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక పరీక్షల నిర్వహణపై ఆయన మాట్లాడుతూ జిల్లాలో 634 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలకు హాజరు కాన్నారని తెలిపారు. ఇందుకోసం మూడు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఇంటర్ పరీక్షలకు 996 మంది విద్యార్థులు హాజరు కానుండగా నాలుగు పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రతిరోజూ ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అన్ని పరీక్షా కేంద్రాల్లో తాగునీరు, విద్యుత్ తదితర ఏర్పాట్లతో పాటు మరుగుదొడ్లు, ఫర్నిచర్, ఇతర మౌలిక సదుపాయాలు ఉండాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అన్ని పరీక్షా కేంద్రాల్లో ప్రాథమిక చికిత్స కేంద్రాలను ఏర్పాటు చేసి ఎఎన్ఎంలు, ఆశాలను నియమించడంతో పాటు ఒఆర్ఎస్ ప్యాకెట్లు, అవసరమైన మందులు అందుబాటులో ఉంచేలా చర్యలు తీసుకోవాలని వైద్యాధికారులను ఆదేశించారు. పరీక్షల సమయంలో విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలని విద్యుత్‌శాఖ అధికారులను ఆదేశించారు. పరీక్షా కేంద్రాల పరిధిలో 144 సెక్షన్ అమలు చేయాలని, పరీక్షా కేంద్రాలకు వంద మీటర్ల పరిధిలో జిరాక్స్ కేంద్రాలు తెరవకుండా చర్యలు చేపట్టాలన్నారు.

రోగుల వివరాల నమోదు తప్పనిసరి

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

రాష్ట్ర ప్రభుత్వం నోటిఫై చేసిన వ్యాధులతో జిల్లాలోని ప్రభుత్వ, ప్రయివేటు ఆస్పత్రుల్లో చేరిన రోగులకు మెరుగైన వైద్యం అందించాలని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి బి.మీనాక్షి ఆదేశించారు. నగరంలోని బగ్గు సరోజిని దేవి, గొలివి, సింధూర ఆస్పత్రులను వైద్యారోగ్యశాఖ సిబ్బందితో కలిసి గురువారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మలేరియా, డెంగీ, టిబి, టైఫాయిడ్, చికెన్‌గున్యా, రేబిస్ తదితర వ్యాధులను రాష్ట్ర ప్రభుత్వం నోటిఫైడ్ వ్యాధులుగా గుర్తించిందన్నారు. ఈ వ్యాధులకు సంబందించిన రోగుల వివరాలను ప్రతిరోజూ సంబంధిత రిజిస్టర్‌లో, ఆన్‌లైన్‌లో తప్పనిసరిగా నమోదు చేయాలని ఆదేశించారు. అలా చేయని ఆస్పత్రులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. జిల్లా మాస్ మీడియా అధికారి పైడి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగాం ప్రారంభం

మాట్లాడుతున్న జగదీశ్వరరావు

ఎచ్చెర్ల : ఎచ్చెర్ల ట్రిపుల్ ఐటిలో ఇసిఇ, మెకానికల్ విభాగాల అధ్యాపకులు, విద్యార్థులకు ఆన్సస్ అనే సాఫ్ట్‌వేర్‌పై రెండు రోజుల పాటు నిర్వహించే ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం (ఎఫ్‌డిపి)ను ట్రిపుల్ ఐటి డైరెక్టర్ పెద్దాడ జగదీశ్వరరావు గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కార్యక్రమం ద్వారా మెరుగైన శిక్షణ పొందడానికి వీలవుతుందన్నారు. శిక్షణ పొందిన అధ్యాపకులు విద్యార్థులకు మరింత అర్థమయ్యే రీతిలో పాఠ్యాంశాలను బోధించడానికి వీలవుతుందన్నారు. కార్యక్రమంలో ఒఎస్‌డి సుధాకర్‌బాబు, పరిపాలనా అధికారి ముని రామకృష్ణ, డీన్ కె.మోహనకృష్ణ చౌదరి, ఫైనాన్స్ ఆఫీసర్ అసిరినాయుడు, డిఎస్‌డబ్ల్యు రవి, మెకానికల్, ఇసిఇ విభాగాధిపతులు కిరణ్మయి, తిరుపతమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌డబ్ల్యుఎస్ జెఇకి షోకాజ్ నోటీసు

ప్రజాశక్తి - కోటబొమ్మాళి

అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

జగనన్న కాలనీ గృహ నిర్మాణాలు ఎందుకు జాప్యమవుతున్నాయని కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ అధికారులను ప్రశ్నించారు. మండలంలోని వాండ్రాడ, శ్రీజగన్నాథపురం సచివాలయాలను గురువారం సందర్శించారు. జగనన్న సురక్ష కార్యక్రమం విజయవంతం చేయాలన్నారు. శ్రీజగన్నాథపురంలో ఇళ్ల నిర్మాణాల్లో జాప్యంపై ప్రశ్నించారు. నీటి సమస్య కారణంగా నిర్మాణాలు చేపట్టడం లేదని సర్పంచ్ సూక సత్యరాజు కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు.

దీనిపై ఆర్‌డబ్ల్యుఎస్ జెఇ కావ్యను కలెక్టర్ ప్రశ్నించగా, ఆమె నీళ్ల నమలడంతో షోకాజ్ నోటీసు జారీ చేయాలని సంబంధిత అధికారులకు సిఫార్సు చేశారు. సచివాలయం, రైతుభరోసా కేంద్రాల భవన నిర్మాణాలను కాంట్రాక్టర్ అసంపూర్తిగా ఉంచేసి 1150 సిమెంట్ బస్తాలు, 51 టన్నుల ఇసుకను కైంకర్యం చేశారని సర్పంచ్ కలెక్టర్‌కు వివరించారు. సంబంధిత కాంట్రాక్టర్ నుంచి ఇసుక, సిమెంట్‌ను రికవరీ చేయాలని తహశీల్దార్ జామి ఈశ్వరమ్మను ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ కె.ఫణీంద్ర కుమార్, ఎంఇఒ ఎల్.వి ప్రతాప్, డిటి మధు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

5 నుంచి జీడి పరిశ్రమలు బంద్

జీడి వ్యాపారుల నిర్ణయం

ప్రజాశక్తి - పలాస

జీడిపప్పు నిల్వలు పేరుకుపోయాయని, అవి పూర్తయ్యే వరకు జులై ఐదు నుంచి ఆగస్టు ఒకటో తేదీ వరకు జీడి పరిశ్రమలను మూసివేయాలని నిర్ణయించినట్లు పలాస జీడి పరిశ్రమల సంఘం అధ్యక్షులు మల్లా సురేష్ తెలిపారు. పలాస జీడిపప్పు ఉత్పత్తిదారుల సంఘం సమావేశ మందిరంలో జీడి వ్యాపారులు గురువారం సమావేశమయ్యారు. పలాస నియోజకవర్గంలోని జీడి పరిశ్రమలన్నీ మూసివేయాలని నిర్ణయం తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీడిపిక్కల ధర, జీడిపప్పు ధరల మధ్య భారీ వ్యత్యాసం ఉండడంతో తీవ్రంగా నష్టపోవాల్సి వస్తోందన్నారు. ప్రస్తుతం ఒక్కో వ్యాపారి వద్ద టన్నుల కొద్దీ జీడిపప్పు నిల్వలు ఉన్నాయని, అవి పాడయ్యే ప్రమాదం ఉందన్నారు. జీడిపప్పు ఆశించిన స్థాయిలో అమ్మకాలు కావడం లేదని, దీంతో వ్యాపారుల వద్ద నిల్వలు పేరుకుపోయాయని చెప్పారు. ధర తగ్గించి అమ్ముతున్నా ట్రేడర్లు ముందుకు రావడం లేదన్నారు. తప్పనిసరి పరిస్థితుల్లోనే జూలై 5 నుంచి ఆగస్టు ఒకటో తేదీ వరకు పరిశ్రమల మూసివేతకు నిర్ణయం తీసుకున్నామన్నారు. అప్పటికీ మార్కెట్ వృద్ధిలోకి రాకుంటే తదుపరి నిర్ణయం తీసుకుంటామన్నారు. పరిశ్రమల పర్యవేక్షణకు సమన్వయకర్తగా వజ్రపుకొత్తూరు మండలానికి చెందిన జీడి పరిశ్రమ యజమాని కొంచాడ మన్మథరావును ఎన్నుకున్నారు. సమావేశంలో పిసిఎంఎ కార్యదర్శి కె.వి శివకృష్ణ, కోశాధికారి పట్నాన రవికాంత్, మల్లా భాస్కరరావు, పారిశ్రామికవాడ అధ్యక్షులు మల్లా రామేశ్వరరావు, కార్యదర్శి తూముల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సమావేశమైన జీడి వ్యాపారులు

త్వరితగతిన రీ సర్వే పూర్తి

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

రీ సర్వే పనులను త్వరితగతిన పూర్తి చేయాలని భూ పరిపాలన కమిషనర్ సిద్ధార్థ జైన్ అధికారులను ఆదేశించారు. జిల్లా అధికారులతో గురువారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. రెండో విడత రీ సర్వే పనుల్లో ఈ నెలాఖరుకు రోవర్లను మార్పు చేసుకుంటూ పనులు చేపట్టాలన్నారు. డేటా ఎంట్రీ త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. గ్రామస్థాయిలో విలేజ్ సర్వేయర్లు డేటా ఎంట్రీలో పాల్గొనాలని, గ్రామాల వారీగా లక్ష్యాలను నిర్దేశించుకోవాలని సూచించారు. జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ మాట్లాడుతూ రెండో విడత రీ సర్వే పనుల్లో 232 గ్రామాల లక్ష్యాలను ప్రభుత్వం నిర్దేశించినట్లు తెలిపారు. అందులో నేటికి 143 గ్రామాల్లో రీ సర్వే పూర్తి చేసినట్లు చెప్పారు. మిగతా వాటిని పూర్తి చేసే దిశగా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. సమావేశంలో జిల్లా ఇన్‌ఛార్జి డిఆర్‌ఒ పి.మురళీకృష్ణ, సర్వే భూ రికార్డుల సహాయ సంచాలకులు ఆర్.విజయ్ కుమార్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జెసి నవీన్

టిడిపి కార్యక్రమానికి అనుమతి నిరాకరణ

పోలీస్‌స్టేషన్ వద్ద గౌతు శిరీష ఆందోళన

ప్రజాశక్తి - పలాస

పలాస-కాశీబుగ్గ మున్సిపాల్టీలోని తాళభద్రలో తెలుగుదేశం పార్టీ శుక్రవారం నిర్వహించనున్న కార్యక్రమానికి పోలీసులు అనుమతి నిరాకరించారు. దీంతో టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష ఆధ్వర్యాన ఆ పార్టీ నాయకులు కాశీబుగ్గ పోలీస్‌స్టేషన్ వద్ద గురువారం రాత్రి ఆందోళన చేపట్టారు. ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు, టిడిపి జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్ తదితరులు పాల్గొనే కార్యక్రమానికి సంబంధించి నాలుగు రోజుల కిందటే అనుమతుల కోసం ఎస్‌పికి దరఖాస్తు చేసుకుంటే, మంత్రి అప్పలరాజు పర్యటన ఉందని చెప్పి అనుమతి ఎలా నిరాకరిస్తారని ప్రశ్నించారు.

విషయాన్ని పార్టీ హైకమాండ్, జిల్లా నాయకుల దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం కాశీబుగ్గ డిఎస్‌పి నాగేశ్వర్ రెడ్డితో ఆమె మాట్లాడారు. మంత్రి సమావేశం ఉందని, ఆ సమయంలో తాము అనుమతులు ఏ విధంగా ఇవ్వగలమని డిఎస్‌పి అన్నారు. ముందుగా తాము పెట్టుకున్న కార్యక్రమాన్ని రద్దు చేయాలనే ఉద్దేశంతో మంత్రి ఈ విధంగా వ్యవహరించారని శిరీష ఆరోపించారు. నాలుగు రోజుల కిందటే తాము దరఖాస్తు చేసుకుంటే, అనుమతులకు ఎందుకు కాలయాపన చేశారని ప్రశ్నించారు. తాళభద్రలో మంత్రికి చెందిన కార్యక్రమాలు ఏవీ లేవని, రాత్రికి రాత్రి కార్యక్రమం ఉందని చెప్పడంలో ఉద్దేశాలను అధికారులు అర్థం చేసుకోవాలన్నారు. రెండు కార్యక్రమాలకు ఇబ్బందుల్లేకుండా చూసే విధంగా రూట్ మ్యాప్‌ను పరిశీలిస్తామని డిఎస్‌పి హామీనిచ్చారు. అనంతరం సిఐ జి.శ్రీనివాసరావుతో కలిసి తాళభద్ర వెళ్లారు.

మాట్లాడుతున్న గౌతు శిరీష

ఇక్కడ డిగ్రీ చదివితేనే టిసిలు ఇస్తాం

- తొగరాం ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ తీరు
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న విద్యార్థులు, తల్లిదండ్రులు

ప్రజాశక్తి - ఆమదాలవలస

మండలంలోని తొగరాం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ పూర్తి చేసుకున్న విద్యార్థులకు టిసిలు ఇచ్చేందుకు ప్రిన్సిపాల్ గోవిందరావు నిరాకరిస్తున్నారని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్పీకర్ తమ్మినేని సీతారాం డిగ్రీ కళాశాలను ఈ ప్రాంతానికి తీసుకొచ్చారని, ఆ కళాశాలలో చేరాలని ఒత్తిడి చేస్తున్నారని ఆరోపించారు. విద్యార్థులు చేరకుంటే ఆ కళాశాల మూతపడే అవకాశం ఉండడంతోనే టిసిలు ఇవ్వడం లేదని చెప్తున్నారు. బిఎస్‌సి నర్సింగ్, ఇంజినీరింగ్, బి.ఫార్మసీ, సాంకేతిక విద్యలను అభ్యసించడానికి ఇతర కళాశాలల్లో చేరేందుకు టిసిలు ఇమ్మని ప్రాధేయపడుతున్నా ఇవ్వడం లేదని విద్యార్థులు వాపోతున్నారు. తొగరాంలో డిగ్రీ కళాశాలలో చేరాలని ఒత్తిడి చేస్తున్నారని ఆరోపిస్తున్నారు. తమకు నచ్చిన కోర్సుల్లో చేరే హక్కు లేదా అని పలువురు విద్యార్థులు కంటతడి పెట్టారు. గట్టిగా ప్రశ్నిస్తే రిమార్కులు రాస్తారేమోనని భయాందోళనలు చెందుతున్నామని వాపోతున్నారు. ఉన్నతాధికారులు కలుగజేసుకుని టిసిలు ఇప్పించాలని కోరుతున్నారు. ఇదే విషయంపై కళాశాల ప్రిన్సిపాల్ గోవిందరావు వివరణ కోరగా, డిగ్రీలో చేరే విద్యార్థులు ఇక్కడి కళాశాలలోనే చేర్పించాలని స్పీకర్ సీతారాం, ఆయన సతీమణి తొగరాం సర్పంచ్ వాణి చెప్పారని తెలిపారు. వారు వినకుంటే తమతో మాట్లాడాలని చెప్పారన్నారు. విద్యార్థులకు నచ్చిన కోర్సులు ఇక్కడ లేనప్పుడు వారి భవిష్యత్ ఏమిటని విలేకరులు ప్రశ్నించగా, ఇక్కడ డిగ్రీ చదవడానికి ఇష్టం లేకుంటే టిసిలను ఇచ్చేస్తామని బదులిచ్చారు.

టిసిల కోసం చెట్ల కింద పడిగాపులు కాస్తున్న విద్యార్థులు

వంద కేజీల గంజాయి పట్టివేత

ప్రజాశక్తి - సోంపేట

ఇచ్ఛాపురం మండలంలోని పురుషోత్తపురం చెక్‌పోస్ట్ వద్ద రెండు దుకాణాల్లో స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అధికారుల తనిఖీల్లో వంద కేజీల గంజాయి, కేజీ నల్లమందు పట్టుబడినట్లు ఎస్‌పి జి.ఆర్ రాధిక తెలిపారు. సోంపేట సర్కిల్ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఇందుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. పురుషోత్తపురం చెక్‌పోస్టు వద్ద రెండు దుకాణాల్లో ఇద్దరు మహిళలు గంజాయిని విక్రయిస్తున్నారన్న సమాచారం మేరకు దాడులు చేసినట్లు చెప్పారు. దుకాణాల్లో నిల్వ ఉంచిన 13 కేజీల గంజాయి, వారి నివాసాల్లో తనిఖీ చేయగా 87 కేజీల గంజాయి, కేజీ నల్ల మందును స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. జాతీయ రహదారిపై వెళ్తున్న లారీ డ్రైవర్లకు, ఇతరులకు ఇద్దరు మహిళలు గంజాయిని విక్రయిస్తున్నారని తెలిపారు. ఇద్దరు మహిళలను అరెస్టు చేసి కేసు నమోదు చేశామన్నారు.

గంజాయి, నాటుసారా రవాణా, విక్రయాల కేసుల్లో నిందితులపై నిఘా పెట్టడం, వారికి కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నామన్నారు. మహిళా పోలీసులు, క్యాంపస్ కాప్స్, జాగృతి కార్యక్రమాల్లో భాగస్వాములైన వారితో ముందస్తు సమాచారాన్ని సేకరించి జిల్లాలో నాటుసారా, గంజాయి కట్టడికి కృషి చేస్తున్నట్లు చెప్పారు. గంజాయి రవాణా, విక్రయాలు చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అటువంటి చర్యలకు పాల్పడే వారి వివరాలను పోలీసులకి తెలియజేయాలని, వారి వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు. సమావేశంలో ఎస్ఇబి ఎఎస్‌పి విజయ్ మణికంఠ, డిఎస్‌పి బి.నాగేశ్వర్ రెడ్డి తదితరులున్నారు.

మహిళలతో మాట్లాడుతున్న అచ్చెన్నాయుడు

వైసిపి పాలనలో భ్రష్టు పట్టిన గ్రామాలు

టిడిపి రాష్ట్ర అధ్యక్షులు అచ్చెన్నాయుడు

కోటబొమ్మాళి : వైసిపి ప్రభుత్వ హయాంలో గ్రామాలు అభివృద్ధికి నోచుకోక భ్రష్టు పట్టాయని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షులు, టెక్కలి ఎమ్మెల్యే కింజరాపు అచ్చెన్నాయుడు విమర్శించారు. మండలంలోని మంచాలపేటలో గురువారం పర్యటించిన ఆయన గ్రామంలోని సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఇంటింటికీ కుళాయి పేరుతో సిమెంట్ రోడ్లను తవ్వేసి పూడ్చకుండా వదిలేశారని గ్రామస్తులు చెప్పారు. అటు తాగునీరూ లేదని, ఇటు రోడ్డు మరమ్మతులు చేపట్టలేదన్నారు. త్వరలో గ్రామాలకు మంచి రోజులు రాబోతున్నాయని, పూర్వవైభవం తీసుకొస్తామని అచ్చెన్నాయుడు చెప్పారు. ప్రజలు చైతన్యవంతులై వైసిపి ప్రభుత్వాన్ని తుంగలో తొక్కాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు బోయిన రమేష్, టిడిపి రాష్ట్ర కార్యదర్శి బోయిన గోవిందరాజులు, మాజీ ఎంపిపిలు టి.రామకృష్ణ, పిఎసిఎస్ మాజీ అధ్యక్షులు కింజరాపు హరివరప్రసాద్, వి.విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు హామీలను ప్రజలు నమ్మరు

రాష్ట్ర పశుసంవర్ధక శాఖ మంత్రి అప్పలరాజు

ప్రజాశక్తి - వజ్రపుకొత్తూరు

ఎన్నికల నేపథ్యంలో చంద్రబాబు ఇస్తున్న హామీలను ప్రజలు నమ్మే స్థితిలో లేరని రాష్ట్ర పశుసంవర్ధక శాఖ మంత్రి సీదిరి అప్పలరాజు అన్నారు. మండలంలోని బాతుపురం పంచాయతీలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి పదవి కోల్పోయిన నాటి నుంచీ చంద్రబాబు మతిభ్రమించి మాట్లాడుతున్నారని చెప్పారు. తనకు అధికారం ఇస్తే ఇంకా ఎక్కువ సంక్షేమం అందిస్తానని కల్లబొల్లి కబుర్లు చెప్పుకొని తిరుగుతున్న చంద్రబాబు, ముఖ్యమంత్రిగా పనిచేసిన 14 ఏళ్ల కాలంలో యూజర్ ఛార్జీల పేరుతో పేద ప్రజలనూ పీడించారని విమర్శించారు. జగన్ సంక్షేమ పథకాలు అందిస్తే రాష్ట్రం అప్పులపాలవుతుందని గగ్గోలు పెట్టిన చంద్రబాబు, తాను అధికారంలోకొస్తే సంక్షేమ పథకాలు ఏవిధంగా అమలు చేస్తారని ప్రశ్నించారు. 2014 ఎన్నికల మేనిఫెస్టోను అధికారంలోకి వచ్చాక వెబ్‌సైట్ నుంచి తీసేసిన ఘనత చంద్రబాబుకే దక్కుతుందన్నారు. అర్హులందరికీ రాజకీయాలకు అతీతంగా పథకాలను అందిస్తున్నామన్నారు. వైసిపి ప్రభుత్వం మేనిఫేస్టోలో ఇచ్చిన హామీలన్నీ అమలు చేసిందని చెప్పారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఎన్ని ఇబ్బందులు ఎదురైనా ఇచ్చిన హామీల అమలులో ఒక్క అడుగూ వెనక్కి వేయలేదన్నారు. సాంకేతిక సమస్యలను పరిష్కరించి మిగతా వారికి న్యాయం చేయడానికి గడప గడపకు కార్యక్రమం నిర్వహిస్తున్నామని చెప్పారు. అనంతరం ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా పలువురు టిడిపి కార్యకర్తలు మంత్రి సమక్షంలో వైసిపిలో చేరారు. కార్యక్రమంలో సర్పంచ్ బత్తిని సృజన లక్ష్మీనారాయణ, జెడ్‌పి వైస్ చైర్మన్ ప్రతినిధి పి.శ్రీనివాసరావు, ఎంపిపి ప్రతినిధి ఉప్పరపల్లి ఉదయ్ కుమార్, పిఎసిఎస్ అధ్యక్షులు దువ్వాడ మధుకేశ్వరరావు, వైసిపి మండల అధ్యక్షులు పుక్కల్ల గురయ్యనాయుడు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మంత్రి అప్పలరాజు

నాపై విచారణ చేయించండి

సిఎంను కోరిన సీడాప్ చైర్మన్

ప్రజాశక్తి - ఇచ్ఛాపురం

ఉద్యోగాలు ఇప్పిస్తానని డబ్బులు తీసుకుని మోసం చేసినట్లు తనపై వచ్చిన ఆరోపణలపై సమగ్ర విచారణ చేయించాలని ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిని కోరినట్లు సీడాప్ చైర్మన్ డి.శ్యామ్‌ప్రసాద్ రెడ్డి తెలిపారు. తనను రాజకీయంగా దెబ్బతీసేందుకు ప్రత్యర్థులు పన్నిన పన్నాగమన్నారు.

CHANGE OF NAME

I, SARASWATI (old name), W/o. Teppala Appa Rao, Service No. 06467381X, Rank: Hony Harildar, Recidencial of Door No: 4/1/48, Kalla Veedhi, Baruva, Sompeta Mandalam, Srikakulam District, Andhra Pradesh Change name from **T. SARASWATI** (old name) to **TEPPALA. SARASWATI** (New Name) hence forth I am being called as **TEPPALA. SARASWATI** (New Name) W/o. APPARAO for all purposes.

BEFORE THE JUDGE FAMILY COURT, BERHAMPUR DIST, GANJAM, ODISHA
Cr.P. 58/2021

Smt. M. Sumita --Petitioner.
Vrs.
Gomangi Mohan --Respondent.
Notice U/O.V, Rule-20 of C.P.C.

To,
Gomangi Mohan, S/O:Late G.Appa Rao, Vill: Vimela Kuturu, PO: Kesharipada, PS: Kanchili, Dist: Srikakulam (A.P.).

NOTICE

Whereas the Petitioner has filed above proceeding for her maintenance **U/S.125(1) of Cr.P.C.in Crp.No.58/2021** before the Judge, Family Court, Berhampur, Dist: Ganjam, Odisha, against you. Inspite of repated notice taken by the Petitioner for your appearance in Court, you are avoiding to receive the said notice sent through Court and by Regd.post.

So take notice that the **Crp. 58/2021 is posted to 08-7-2023** for your appearance at **10.30 A.M.,** In case you fail to appear on that day either personally or through your Advocate, you will be set exparte in the above case.

Given under my hand and the seal of this Court.

FAMILY JUDGE,
Berhampur,
Ganjam, Odisha.

ప్రోత్సాహకాలను అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

విద్యార్థులకు ప్రోత్సాహకాలు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

నగరంలోని ఎన్‌టిఆర్ మున్సిపల్ హైస్కూల్‌లో విద్యా ప్రమాణాలు మెరుగుపడడానికి తోడ్పాటు అందిస్తున్న ఉపాధ్యాయుల కృషి ప్రశంసనీయమని పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షులు వి.జె.కె.మూర్తి, ప్రధాన కార్యదర్శి జామి భీమశంకర్ అన్నారు. ఈ ఏడాది పదో తరగతి పరీక్షల్లో నియోజకవర్గ స్థాయిలో కొత్తకోట తేజస్విని నియోజకవర్గ పరిధిలో రెండో స్థానం, పాఠశాల స్థాయిలో డి.వి.ఎం.సుధీర్ ద్వితీయ, ఉంగటి చాందిని తృతీయ స్థానాలు సాధించారు. తేజేస్వినికి రూ.5 వేలు నగదు అందజేశారు. అనంతరం పాఠశాల ప్రధానోపాధ్యాయులు సిహెచ్.దేవదత్తానంద్‌తో కలిసి ప్రతిభ సాధించిన విద్యార్థులకు గురువారం ప్రోత్సాహకాలు, ఉపాధ్యాయులకు జ్ఞాపికలను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 170 ఏళ్ల చరిత్ర ఉన్న ఈ పాఠశాల మరింతగా అభివృద్ధి చెందేందుకు కృషి చేయాలని అన్నారు. కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు జె.ఎస్.ఎస్.ప్రకాశరావు, పాలిశెట్టి మల్లిబాబు, కిల్లాన ఫల్గుణరావు, సిహెచ్.వి.ప్రసాద్, ఢిల్లి భాస్కరరావు, కె.ఎల్.ఎన్.మూర్తి, పేర్ల కామరాజు, అధ్యాపకులు దేవదత్తానంద్, వి.శ్రీనివాసరావులు పాల్గొన్నారు.

పోస్టర్లను ఆవిష్కరిస్తున్న వ్య.కా.స నాయకులు

1 నుంచి వ్య.కా.స శిక్షణా తరగతులు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

జులై 1 నుంచి మూడు రోజుల పాటు ఎపి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్రస్థాయి శిక్షణా తరగతులు నగరంలోని యుటిఎఫ్ కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సిర్ల ప్రసాద్, గంగరాపు సింహాచలం తెలిపారు. నగరంలోని వ్యవసాయ కార్మిక సంఘం కార్యాలయంలో శిక్షణా తరగతుల పోస్టర్లను గురువారం విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వ్యకాస గ్రామీణ ప్రాంతాల్లో వలసల నివారణకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. దున్నే వారికి భూమి హక్కు కల్పించాలన్నారు. రైతులకు గిట్టుబాటు ధరలు, ఉపాధి పనులు కల్పించాలని అన్నారు. ధరలకు అనుగుణంగా రూ.600 కూలి ఇవ్వాలని డిమాండ్ చేశారు. అన్యాక్రాంతమైన భూములు స్వాధీనం చేసుకోవాలన్నారు. అసైన్‌మెంట్ కమిటీ ఆధ్వర్యాన భూములను పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. అలాగే సంఘం ఆధ్వర్యాన జిల్లాలో నిర్వహిస్తున్న పోరాటాలు, తదితర అంశాలపై రాష్ట్రస్థాయి శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో వ్యకాస జిల్లా నాయకులు. గంగరాపు ఈశ్వరమ్మ, కొల్లి ఎల్లయ్య పాల్గొన్నారు.

'జగనన్న సురక్ష'తో సేవలు సులభతరం

శాసనసభ స్పీకర్ సీతారాం

ప్రజాశక్తి- ఆమదాలవలస

జగనన్న సురక్షతో సేవలు సులభతరం కానున్నాయని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. పట్టణంలోని ఓ ప్రయివేటు కళ్యాణ మండపంలో ఆమదాలవలస, సరుబుజ్జిలి, బూర్జ, మున్సిపాలిటీకి సంబంధించిన మండల అధికారులు, పార్టీ నాయకులు, సచివాలయ ఉద్యోగులు, వాలంటీర్లతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ నెల 23 నుంచి వచ్చే నెల 23 వరకు జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో ప్రత్యేక శిబిరాలను నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ఈ శిబిరాల్లో 11 రకాల ధ్రువపత్రాలను ఉచితంగా అందించనున్నారని తెలిపారు. ఈ పత్రాలు జులై 1 నుంచి 11 వరకు మంజూరుకు సిద్ధంగా ఉండాలన్నారు. 24 నుంచి వాలంటీర్లు, సచివాలయాల సిబ్బంది ఆయా పరిధిలోని ఇంటింటికీ వెళ్లి ఏయే సమస్యలు పరిష్కారమవుతాయి, ఎటువంటి ధ్రువపత్రాలు మంజూరు చేస్తారు వంటి అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎం.రవిసుధాకర్, తహశీల్దార్లు గణపతి, రమేష్, రమణారావు, ఎంపిడిఒలు

ఆమదాలవలస : మాట్లాడుతున్న స్పీకర్ సీతారాం

ఎస్.వాసుదేవరావు, రవి, మోహన్, వైసిపి యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తమ్మినేని చిరంజీవి నాగ్, ఎంపిపి ప్రతినిధి తమ్మినేని శ్రీరామ్మూర్తి, జెడ్‌పిటిసి బెండి గోవిందరావు, పిఎసిఎస్ అధ్యక్షులు గురుగుబెల్లి శ్రీనివాసరావు, డిసిఎంఎస్ డైరెక్టర్ బొడ్డేపల్లి నారాయణరావు పాల్గొన్నారు.

పొందూరు: స్థానిక జెవిఆర్ కన్వెన్షన్‌లో జగనన్న సురక్ష విజయవంతంపై అధికారులతో శాసనసభ స్పీకర్ సీతారాం సమీక్షించారు. కార్యక్రమంలో తహశీల్దార్ ఎస్.రాంబాబు, ఎంపిడిఒ సీపాన హరిహరరావు, ఎపిఒ శ్రీనివాసరావు, ఎపిఎం శ్యామలరావు, జెడ్‌పిటిసి లోలుగు కాంతారావు, ఎంపిపి ప్రతినిధి కిల్లి నాగేశ్వరరావు, పిఎసిఎస్ అధ్యక్షులు కొంచాడ రమణమూర్తి, ఎఎంసి అధ్యక్షులు బాడాన సునీల్ కుమార్, మండల అధ్యక్షుడు పప్పల రమేష్‌కుమార్ పాల్గొన్నారు.

టెక్కలి రూరల్ : జగనన్న సురక్షను విజయవంతం చేయాలని నియోజకవర్గ ఇన్‌ఛార్జి జెడ్‌పిటిసి దువ్వాడ వాణి పిలుపునిచ్చారు. ఆదిత్య కళ్యాణ మండపంలో జగనన్న సురక్ష కార్యక్రమంపై అధికారులతో సమీక్షించారు. కార్యక్రమంలో ఎంపిపి అట్లా సరోజినమ్మ, మండల పార్టీ అధ్యక్షులు బగాది హరి, కోత సతీష్, మాజీ ఎంపిపి సంపతరావు, రాఘవరావు పాల్గొన్నారు.

జలుమూరు: జగనన్న సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపిపి వాన గోపి పిలుపునిచ్చారు. మండల పరిషత్ కార్యాలయంలో మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో తహశీల్దార్ బి.సత్యం, ఎంపిడిఒ ఐ.వి.అప్పారావు, ఎంఇఒ బమ్మిడి మాధవరావు, ఇఒపిఆర్‌డి ఉమామహేశ్వరరావు, మండల ఇంజినీర్ కె.శ్రీధర్, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ చైతన్య, హౌసింగ్ ఎఇ పాల్గొన్నారు.

పోలాకి : జులై 1 నుంచి జగనన్న సురక్ష కార్యక్రమం ప్రారంభిస్తున్నామని ఎంపిడిఒ కె.ఉషశ్రీ మండల పరిషత్ కార్యాలయంలో తెలిపారు. అన్ని సచివాలయం పరిధిలోని వాటి షెడ్యూల్ విడుదల చేశామన్నారు.

కెజిబివిలో మహిళా ఉద్యోగులకు అన్యాయం

టిడిపి జిల్లా అధ్యక్షులు రవికుమార్

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

కెజిబివి పాఠశాలల్లో కొన్నేళ్లుగా పనిచేస్తున్న మహిళా ఉద్యోగులను తొలగించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నాంది పలికిందని, తక్షణమే వారికి ఇచ్చిన నోటీసులను వెనక్కు తీసుకోవాలని టిడిపి జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్ డిమాండ్ చేశారు. జిల్లా టిడిపి కార్యాలయంలో గురువారం విలేకరులతో మాట్లాడారు. కెజిబివిలో 2005లో మూడు సంస్థల ద్వారా ఐటిడిఎ, ఆర్‌పిఎం, ఎపిఎస్‌సి సొసైటీలను ఏర్పాటు చేశారని అన్నారు. ఉమ్మడి జిల్లాలోని 38 మండలాల్లో 32 కెజిబివి కేంద్రాలు మాత్రమే ఉన్నాయని అన్నారు. గతంలో ఉద్యోగులుగా ఎంపిక చేసి మరికొందరిని

మాట్లాడుతున్న రవికుమార్

గెస్ట్ ఫ్యాకల్టీగా నియమించారన్నారు. వారూ పదేళ్ల సర్వీసు పూర్తి చేసుకుని విధులు నిర్వర్తిస్తున్నారని అన్నారు. ఎప్పటికైనా కెజిబివిలో తమ భవిష్యత్, ఉద్యోగ భద్రత కలుగుతుందన్న నమ్మకంతో పనిచేస్తున్న మహిళా ఉపాధ్యాయులకు ప్రభుత్వం అన్యాయం చేస్తోందన్నారు. ఏళ్ల తరబడి పనిచేసే వారిని తొలగించి మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల ఒత్తిళ్లకు తలొగ్గి అధికారులు కెజిబివి మహిళా ఉపాధ్యాయులకు నోటీసులు జారీ చేయడం దారుణమన్నారు. నూతనంగా కెజిబివిల్లో ఉపాధ్యాయ పోస్టులు భర్తీ జరిగినట్లయితే మంత్రులు, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు రూ.లక్షలు దండుకోవచ్చన్న భావనతో ఈ దురాగతానికి పాల్పడ్డారని ఆరోపించారు. కష్టపడి చదివినవారికి ఉద్యోగం కల్పించకుండా రాజకీయ పలుకుబడితో సంపాదించుకునే వారికి అధికారులు అండగా నిలవడం సిగ్గుచేటన్నారు. ఫేక్ ధ్రువపత్రాలను సృష్టించి ప్రజా ప్రతినిధిగా చెలామణి అవుతున్న స్పీకర్ తమ్మినేని సీతారాంపై విచారణ జరపాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా న్యాయబద్ధంగా పనిచేస్తున్న వారి తరుపున పోరాడేందుకు టిడిపి సిద్ధంగా ఉందన్నారు. సమావేశంలో టిడిపి నాయకులు శింతు సుధాకర్, మాజీ అధ్యక్షులు చౌదరి నారాయణమూర్తి, జిల్లా ఉపా ధ్యక్షులు పి.ఎం.జె.బాబు, నగర పార్టీ అధ్యక్షుడు మాదారపు వెంకటేష్ పాల్గొన్నారు.

రేపు ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి- శ్రీకాకుళం లీగల్

ఈ నెల 24న జిల్లా కోర్టు ఆవరణలోని జిల్లా బార్ అసోసియేషన్ నూతన భవనంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షతన ఉచిత వైద్య శిబిరం నిర్వహించినట్లు జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ ఎన్ని సూర్యారావు, పొన్నాడ రాము తెలిపారు. బార్ అసోసియేషన్ భవనంలో గురువారం విలేకరులతో మాట్లాడారు. ప్రాణదాత ఫౌండేషన్ వారి ఆధ్వర్యాన నిర్వహించన్ను ఈ శిబిరంలో దంతాను పరీక్షిస్తారని అన్నారు. స్వచ్ఛంద రక్తదాన శిబిరాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. మెడికవర్ ఆస్పత్రి, సంజన డెంటల్ క్లినిక్ వారి సౌజన్యంలో ఉదయం 9.30 గంటలకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమానికి జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా పాల్గొని వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తారని అన్నారు. ఈ అవకాశాన్ని న్యాయవాదులు, కోర్టు సిబ్బంది వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో

మాట్లాడుతున్న సూర్యారావు

న్యాయవాదులు ఇంటి గోవింద్, కె.రాంబాబునాయుడు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో బాలుడు మృతి

సూర్య మృతదేహం

ఇచ్ఛాపురం : మండలంలోని ఈదుపురం బాహుదా వంతెన వద్ద గురువారం ద్విచక్ర వాహనం అదుపు తప్పి కింద పడడంతో పండి సూర్య (15) మృతి చెందగా, విశ్వనాథం స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కవిటి మండలం దుర్గంపుట్టుకు చెందిన పండి సూర్య, స్నేహితుడు దుర్గాసి విశ్వనాథం కలిసి ద్విచక్ర వాహనంపై సొంత పనుల నిమిత్తం ఇచ్ఛాపురం వచ్చారు. పనులు ముగించుకుని స్వగ్రామానికి వెళ్తుండగా... వంతెన వద్ద బైక్ అదుపు తప్పి బోల్తా పడింది. బైక్ వెనుక కూర్చున్న సూర్యకు తీవ్ర గాయాలయ్యాయి. విశ్వనాథం స్వల్పంగా గాయపడ్డాడు. వెంటనే స్థానికులు ఇచ్ఛాపురం ప్రభుత్వాస్పత్రికి తరించారు. సూర్య పరిస్థితి ఆందోళనకరంగా ఉండడంతో వైద్యులు ప్రథమ చికిత్స నిర్వహించి బరంపురంలో రిఫర్ చేశారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృత్యువాత పడ్డాడు. మృతుడు పెద్దమ్మ డి.రుద్రాక్ష ఇచ్చిన ఫిర్యాదు మేరకు రూరల్ ఎస్ఐ రమేష్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అగ్నివీర్ అభ్యర్థులకు ఉచిత శిక్షణ

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ఇండియన్ ఆర్మీ కాలింగ్ కేంద్రం ఆణ్వర్యాన శ్రీకాకుళంలో అగ్నివీర్ అభ్యర్థులకు ఉచిత శారీరక శిక్షణ ఇవ్వనున్నట్టు సంస్థ నిర్వహకులు రమణమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. తాజాగా విడుదలైన అగ్నివీర్ ఫలితాల్లో ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులు శారీరక పరీక్షలకు శిక్షణ పొందడానికి వీలుగా 45 రోజులు, 90 రోజులు శిబిరాలు నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. విశాఖ, గుంటూరు, సికింద్రాబాద్ ఎఆర్‌ఒల పరిధిలోని అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగపర్చుకోవాలని కోరారు. శిక్షణకు హాజరయ్యే అభ్యర్థులకు భోజనం, వసతి సౌకర్యం కల్పిస్తున్నట్టు తెలిపారు. వివరాలకు 6281284246, 6300893618 సెల్ నంబర్లను సంప్రదించాలని సూచించారు.

నేడు లైదాంలో స్పీకర్ పర్యటన

పొందూరు: మండలంలో లైదాం, కొల్లిపేట గ్రామాల్లో శుక్రవారం జలజీవన్ మిషన్ ద్వారా ఇంటింటికీ తాగునీటి కుళాయి పనులకు శాసనసభ స్పీకర్ సీతారాం శంకుస్థాపన చేస్తారని ఎంపిపి కిల్లి ఉషారాణి, జెడ్‌పిటిసి లోలుగు కాంతారావు, వైసిపి మండల అధ్యక్షుడు పప్పల రమేష్‌కుమార్‌లు తెలిపారు. ఉదయం 10 గంటలకు నిర్వహించే ఈ కార్యక్రమానికి మండలంలోని వైసిపి నాయకులు, కార్యకర్తలు, అధికారులు, హాజరుకావాలని కోరారు.

మూలపేటలో లోఓల్టేజ్ సమస్య

కోటబొమ్మాళి: మండలంలోని లఖందిడ్డి పంచాయతీ మూలపేటలో కొద్ది నెలలుగా లోఓల్టేజి సమస్య ఉందని, దీంతో విద్యుత్ పరికాలు తరచూ మరమ్మతులకు గురవుతున్నాయని వివేకానంద యువజన సంఘం నాయకులు తెలిపారు. స్థానిక విద్యుత్ శాఖ అధికారులకు వినతిపత్రాలు అందజేసినా ఫలితం శూన్యమని వాపోతున్నారు. లోఓల్టేజీ సమస్యతో రాత్రి పూట ఫ్యాన్లు తిరగక చాలా ఇబ్బందులు పడుతున్నామని అన్నారు. ముఖ్యంగా తాగునీటి బోర్లు పనిచేసిక నీటి కోసం అవస్థలు పడుతున్నారని పేర్కొన్నారు. విద్యుత్‌శాఖాధికారులు స్పందించి లోఓల్టేజీ సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

సరుకులను పంపిణీ చేస్తున్న సభ్యులు

సరుకుల పంపిణీ

ప్రజాశక్తి- కవిటి

సమాజ సేవకు మించిన సేవ లేదని రోహన్ కుమార్ యువసేన సభ్యులు అన్నారు. రోహన్ కుమార్ గురుస్వామి పుట్టినరోజు సందర్భంగా ఆయన ఆర్థిక సాయంతో మండలంలోని రాజపురం పంచాయతీ పరిధిలోని 50 నిరుపేద కుటుంబాలకు గురువారం నిత్యవసర వస్తువులు, చీరలు, దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సభ్యులు మాట్లాడుతూ కుంటికోటకి చెందిన రోహన్ కుమార్ సమాజ సేవలో ముందుంటారని అన్నారు. మండలంలో ఇప్పటికే పలు సామాజిక కార్యక్రమాలు చేపట్టారని, భవిష్యత్‌లో మరిన్ని కార్యక్రమాలు నిర్వహిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ఎన్ని అశోక్, బొర్ర రమేష్, బొర్ర నరసింహమూర్తి, పూడి సంతోష్, ఎన్ని రవికుమార్ పాల్గొన్నారు.

హాజరును పరిశీలిస్తున్న ఎంపిడిఒ అప్పారావు

ఎంపిడిఒ ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి- జలుమూరు

మండలంలోని లింగాలవలస గ్రామ సచివాలయాన్ని ఎంపిడిఒ ఐ.వి.అప్పారావు గురువారం ఆకస్మికంగా సందర్శించి రికార్డులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వివిధ పనులపై సచివాలయానికి వచ్చే అర్జీదారులతో, లబ్ధిదారులతో స్నేహపూర్వకంగా మెలగాలన్నారు. అనంతరం గ్రామంలోని అంగన్వాడీ కేంద్రాన్ని సందర్శించి తనిఖీ చేశారు. అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న పౌష్టికాహారాన్ని సక్రమంగా అందజేయాలని అంగన్వాడీ కార్యకర్తకు సూచించారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, అంగన్వాడీ కార్యకర్తలు ఉన్నారు.

దరఖాస్తులకు ఆహ్వానం

పోలాకి: మండలంలోని ఈదులవలస ఎపి మోడల్ స్కూల్‌లో 7,8,9 తరగతులు ఖాళీలు ఉన్న ప్రాప్తికి పూర్తి చేసేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని ప్రిన్సిపాల్ పైడి ప్రవీణ ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు ఈ నెల 27లోగా విద్యార్థి ఆధార్ కార్డు, కుల ధ్రువీకరణ పత్రాల జిరాక్స్‌తో పాటు దరఖాస్తులను పాఠశాలకు అందజేయాలని సూచించారు. త్వరలో ప్రవేశ పరీక్ష ప్రకటిస్తామని తెలిపారు.

'చింతాడ'కు న్యాయశాస్త్రంలో పట్టా

పట్టాను అందుకుంటున్న రవికుమార్

ఆమదాలవలస : ఉన్నత విద్యావంతునిగా గుర్తింపు తెచ్చుకున్న వైసిపి ప్రచార విభాగం జోనల్ ఇన్‌ఛార్జి చింతాడ రవికుమార్ విద్యార్హతల సరసన మరో ఉన్నత డిగ్రీ చేరింది. ప్రతిష్టాత్మకమైన ఆంధ్రా విశ్వవిద్యాలయం నుంచి ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్‌లో డాక్టరేట్‌ను పొందారు. మరెన్నో ప్రతిష్టాత్మక యూనివర్సిటీల్లో నిట్, ఐఐటి, ఐఐఎంల వంటి విద్యా సంస్థల్లో ఎన్నో సెమినార్లను ఇచ్చారు. 30 అంతర్జాతీయ జర్నల్స్‌లో తను చేసిన పరిశోధనలు ప్రచురితమై తను చేపట్టిన అధ్యాపక వృత్తిలో ప్రత్యేకమైన గుర్తింపు తెచ్చుకున్నారు. సామాజిక సేవా దృక్పథంతో ప్రస్తుతం తను ఎంచుకున్న రాజకీయ రంగంలోనూ ప్రజలకు మరింత విస్తృత సేవలు అందించే ఆలోచనలతో ప్రతిష్టాత్మకమైన ఆంధ్రా విశ్వవిద్యాలయం నుంచి న్యాయశాస్త్రంలో డిగ్రీని సాధించారు. ఆయన సాధించిన ఎల్ఎల్‌బి డిగ్రీ పట్టాను ఈ నెల 21న ఆంధ్రా విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ పి. జి.వి.డి.ప్రసాదరెడ్డి చేతుల మీదుగా విశాఖపట్నంలో అందుకున్నారు. రవికుమార్ న్యాయశాస్త్ర పట్టాను సాధించడంతో వైసిపి నాయకులు, స్నేహితులు అభినందించారు.

మాట్లాడుతున్న మాధవరావు

నేడు సంతకాల సేకరణ

ప్రజాశక్తి- పలాస

పెంచిన విద్యుత్ ఛార్జీలను తక్షణమే తగ్గించాలని వామపక్ష నాయకులు డిమాండ్ చేశారు. కాశీబుగ్గ సిపిఐఎంఎల్ న్యూడెమోక్రసీ కార్యాలయంలో పెరిగిన విద్యుత్ ఛార్జీలపై గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాశీబుగ్గ సంత మైదానంలో శుక్రవారం విద్యుత్ ఛార్జీల పెంపుపై సంతకాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. మోడీకి తలొగ్గి రాష్ట్ర ప్రభుత్వం ప్రజలపై రూ.13 వేల కోట్లు విద్యుత్ భారాలు వేయడం దుర్మార్గమన్నారు. సర్ ఛార్జీలు, ట్రూ ఆఫ్ ఛార్జీలు, కస్టమర్ ఛార్జీలు, ఇంధన ఛార్జీలన్నీ ప్రజలపై మోపిందన్నారు. శ్లాబు సిస్టంలో కూడా సవరించి ధరలు పెంచి ప్రజల నుంచి బలవంతంగా కట్టించుకుంటున్నారని విమర్శించారు. సంతకాల సేకరణతో ప్రారంభమై రాష్ట్ర ప్రభుత్వాన్ని గద్దె దించే దాకా కొనసాగుతుందని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆయా పార్టీల నాయకులు సిపిఎం ఎన్.గణపతి, సిపిఐ సిహెచ్.వేణుగోపాల్, సిపిఐఎంఎల్ న్యూ డెమోక్రసీ నాయకులు వంకల మాధవరావు, సిపిఐఎంఎల్ లిబరేషన్ నాయకులు మద్దిల రామారావు, జుత్తు వీరాస్వామి, సోమేష్ పాల్గొన్నారు.

25న జిల్లా జట్టు ఎంపిక

టెక్కలి : ఈ నెల 25న ఉదయం 9 గంటలకు స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో ఆట్యా, పాట్యా అండర్-14 బాలురు, బాలికల జట్ల ఎంపిక నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం నిర్వాహకులు బాడాన నారాయణరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికకు హాజరయ్యే క్రీడాకారులు ఆధార్ కార్డు జిరాక్స్‌లు, వయసు ధ్రువీకణ పత్రంతో హాజరుకావాలన్నారు. ఎంపికైన జిల్లా జట్టు జూలై ఒకటి, రెండు తేదీల్లో తూర్పుగోదావరి జిల్లా తునిలో నిర్వహించనున్న అంతర్ జిల్లాల సబ్ జూనియర్ ఆట్యా, పాట్యా పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు 8500007272 నంబరును సంప్రదించాలని కోరారు.

మూడు రోజుల్లో షాపుల తొలగింపు

ఇచ్ఛాపురం : పట్టణంలో ప్రభుత్వాస్పత్రిలో రోడ్డులో ఉన్న పీర్ల పంజాకు సంబంధించిన ముస్లిం స్థలంలో అక్రమంగా ఉన్న షాపులు మూడు రోజుల తొలగించాలని వక్ఫ్‌బోర్డు స్పెషల్ టాస్క్‌ఫోర్స్ అధికారి ముసాబిన్ ఇబ్రహిం స్పష్టం చేశారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో తహశీల్దార్ గురుప్రసాద్, సిఐ ఈశ్వర్‌చంద్ర, మున్సిపల్ కమిషనర్ రమేష్, పట్టణ ఎస్ఐ గోవిందరావులతో కలిసి గురువారం షాపుల యజమానులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వక్ఫ్‌బోర్డు అధికారులు ఇచ్చిన గడువులోగా తొలగించాలని, లేని పక్షంలో ప్రొక్లెయినర్‌తో తొలగిస్తామని హెచ్చరించారు. ఈ సందర్భంగా వ్యాపారులు మాట్లాడుతూ 30 ఏళ్లు ఇదే స్థలంలో చిన్న చిన్న వ్యాపారులు చేసుకుంటూ తమ కుటుంబాలను

మాట్లాడుతున్న ముషాబిన్ ఇబ్రహీం

పోషిస్తున్నామని, తొలగింపుకు రెండు నెలలు గడువు కావాలని అధికారులను అభ్యర్థించారు. ఖాళీ చేసే స్థలంలో అవకాశం కల్పించి తమ కుటుంబాల జీవనోపాధికి ఇబ్బంది లేకుండా షాపులు కేటాయించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై వక్ఫ్‌బోర్డు అధికారులు సమాధానమిస్తూ... ముస్లిం యువతకు ఇచ్చిన తర్వాత అవకాశ ఉంటే చోటు కల్పిస్తామని తెలిపారు.

'నవోదయ'కు విద్యార్థుల ఎంపిక

బూర్జ: జవహర్ నవోదయ ప్రవేశ పరీక్షా ఫలితాల్లో మండలంలోని చిన్నలంకం మండల పరిషత్ పాఠశాల విద్యార్థులు ప్రతిభ చూపారు. బొడ్డేపల్లి లోహితాశ్రీమణి 86 మార్కులతో మొదటి స్థానం సాధించగా, బాన్న జగదీష్ 62 మార్కులతో 17వ ర్యాంకు సాధించి తోటి విద్యార్థులకు ఆదర్శంగా నిలిచారు. ఈ సందర్భంగా ర్యాంకులు సాధించి పాఠశాలకు మంచి పేరుని తీసుకొచ్చిన వీరికి ఉపాధ్యాయులు ముదిలి రామారావు, బొడ్డేపల్లి శ్రీనివాసరావు అభినందనలు తెలిపారు.

లావేరు : మండలంలోని చిన్నమురపాకకు చెందిన మీసాల అభిషేక్ సరుబుజ్జిలి మండలం వెన్నెలవలస నవోదయకు ఆరో తరగతి ప్రవేశానికి నిర్వహించిన పరీక్షా ఫలితాల్లో నూటికి 96 మార్కులు సాధించి జిల్లాలో 5 వస్తానాన్ని కైవసం చేసుకున్నారు. అలాగే ఎపి మోడల్స్ తామడ

శ్యామ్‌సాయి
పొందూరు

కౌశిక్
పొందూరు

అభిషేక్
లావేరు

నిర్వహించిన ఆరో తరగతి ప్రవేశ పరీక్షా ఫలితాల్లోనూ 9వ ర్యాంకు సాధించారు. ఒకటి నుంచి ఐదో తరగతి వరకు రవితేజ పాఠశాలలో చదివాడు. సాధారణ రైతు కుటుంబంలో పుట్టి ప్రవేశ పరీక్షా ఫలితాల్లో మంచి స్థానాన్ని సంపాదించడంతో ప్రిన్సిపాల్ పి.చిన్నారావు, వేణుగోపాలరావు, ఉపాధ్యాయులు అభినందించారు.

టెక్కలి : పట్టణంలోని సర్వమంగళవీదిలో గల విజ్ఞాన్ ప్రాథమికోన్నత పాఠశాలకు చెందిన బౌరోతు గణేష్, వైశ్యరాజ్ సహస్ర, నేపలం తేజశ్వర్‌లు సరుబుజ్జిలి మండలం వెన్నెలవలసలోని జవహర్ నవోదయ స్కూల్‌లో ఆరో తరగతిలో ప్రవేశానికి అర్హత సాధించారని పాఠశాల కరస్పాండెంట్ బి.రాజశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. తమ పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు ఎంపిక కావడంపై ప్రధానోపాధ్యాయులు రఘుకృష్ణ, శిక్షకులు గేదెల తిరుపతిరావులు, ఉపాధ్యాయులు అభినందించారు.

పొందూరు: జవహర్ నవోదయ పాఠశాలలో ఆరో తరగతిలో ప్రవేశానికి నిర్వహించిన ప్రవేశ పరీక్షా ఫలితాల్లో స్థానిక మానసవేణి పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు ఎంపికయ్యారు. పాఠశాలకు చెందిన అంబళ్ల శ్యామ్‌సాయి, గొర్లె కౌశిక్‌లు ఎంపికయ్యారు. విద్యార్థులు నవోదయకు ఎంపిక కావడంపై పాఠశాల ప్రిన్సిపాల్ ఈశ్వరరావు, డైరెక్టర్ ఎంఆర్ఆర్ సిహెచ్.కుమార్‌లు అభినందించారు.

పుష్పగుచ్ఛం అందజేస్తున్న సభ్యులు

నడక వంతెన తెరిపించాలి

ప్రజాశక్తి- పలాస

పలాస రైల్వే స్టేషన్‌ను ఈస్టుకోస్టు రైల్వే డివిజనల్ మేనేజర్ రింకేష్ రాయ్ గురువారం రాత్రి సందర్శించారు. స్టేషన్ మేనేజర్ భవనంలో రైల్వే అధికారులు, ఉద్యోగులతో సమీక్షించారు. అంతకుముందు పలాస రైల్వే అభివృద్ధి కమిటీ సభ్యులు డిఆర్ఎంకు ఘనంగా స్వాగతం పలికారు. కమిటీ సభ్యులు మాట్లాడుతూ నర్సిపురానికి వెళ్లే కాలిబాట వంతెన మూసివేయడంతో ప్రజలు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారని, కాలిబాట వంతెన తెరిచేవిధంగా చూడాలని విన్నవించారు. కార్యక్రమంలో పలాస ప్రభుత్వ సామాజిక ఆస్పత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్, సలహా కమిటీ సభ్యుడు డి.భవానీశంకర్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పి.వి.సతీష్, కౌన్సిలర్లు గుజ్జు జోగారావు, పి.అజయ్‌కుమార్ పాల్గొన్నారు.

జిల్లాకు మంచి పేరు తీసుకురావాలి

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

జిల్లాలోని గార మండలం ఒప్పంగికి చెందిన చల్ల కళ్యాణి ఇటీవల విడుదలైన సివిల్ పరీక్షా ఫలితాల్లో ఫలితాల్లో 285 ర్యాంకు సాధించింది. ఈ మేరకు టిడిపి రాష్ట్ర అధ్యక్షులు, ఎమ్మెల్యే కింజరాపు అచ్చెన్నాయుడును నిమ్మాడ తన క్యాంపు కార్యాలయంలో గురువారం కలిశారు. ఈ సందర్భంగా ఆమెకు దుశ్శాలువ కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా అచ్చెన్న మాట్లాడుతూ మన జిల్లా పేరును దేశంలో గుర్తిండే విధంగా పనిచేయాలని అన్నారు.

కళ్యాణిని సన్మానిస్తున్న అచ్చెన్నాయుడు

సంతబొమ్మాళి మండలం అకాశలక్కవరం, మేఘవరం, పోలాకి మండలం కొత్తరేవు, టెక్కలి మేజరు పంచాయతీకి చెందిన టిడిపి నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు.

పాఠశాలను పరిశీలిస్తున్న ఎంఇఒ-2 లావణ్య

పాతర్లపల్లి పాఠశాల సందర్శన

రణస్థలం: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు చేరేందుకు ఉపాధ్యాయులందరూ కృషి చేయాలని ఎంఇఒ-2 బి.లావణ్య సూచించారు. మండలంలోని పాతర్లపల్లి ఎస్‌సి కాలనీ పాఠశాలను గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులు చేరేందుకు గ్రామస్థాయిలో సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, వార్డు మెంబర్లు, గ్రామ పెద్దల సహాయ సహకారాలు తీసుకోవాల న్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మధ్యాహ్న భోజనం, పుస్తకాలు, యూనిఫారాలు, బ్యాగు, బూట్లు అందిస్తున్నారని అన్నారు. వెనుకబడిన విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఈ మేరకు రికార్డులను, నాడు-నేడు పనులు మధ్యాహ్న భోజనాన్ని నేరుగా పరిశీలించారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని పాతటెక్కలి ఎంపిటిసి బాలక శ్రీనివాసరావు అన్నారు. పాతటెక్కలి రైతు భరోసా కేంద్రంలో సర్పంచ్ తుంగాన సుశీలతో కలిసి గురువారం రైతులకు విత్తనాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గతంలో విత్తనాలు, ఎరువుల కోసం రైతులు మండల కేంద్రాల చుట్టూ తిరిగేవారని, ప్రస్తుతం అటువంటి సమస్య లేదని ఆయన అన్నారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు నాణ్యమైన సేవలు సకాలంలో అందుతున్నాయని అన్నారు. ప్రభుత్వం రైతులకు రాయితీపై విత్తనాలను ఎరువులను అందిస్తుందన్నారు. ప్రతి రైతూ ఇకెవైసి తప్పనిసరిగా చేయించుకోవాలని, దాని ఆధారంగానే పంటల బీమా, ఇన్‌పుట్ సబ్సిడీ, రైతు భరోసా వంటి పథకాలు రైతులకు అందుతాయని తెలిపారు. ఈ సందర్భంగా రైతులకు 230 కిలోల తెట్టంగి విత్తనాలు స్వర్ణ, సాంబ 1061,1061 రకాల విత్తనాలను 46 మంది రైతులకు అందజేశారు. 25 కిలోల సాంబ 700, 30 కిలోల 1060 రకం రూ.850 చొప్పున విక్రయిస్తున్నట్లు వ్యవసాయ సహాయకులు వి.ప్రవీణ తెలిపారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు దాలయ్య, వ్యవసాయం మార్కెట్ కమిటీ డైరెక్టర్ కొల్లి జోగారావు పాల్గొన్నారు.

వజ్రపుకొత్తూరు: విత్తనాలను పంపిణీ చేస్తున్న శ్రీనివాసరావు

పలాస : రైతు భరోసా కేంద్రాల ద్వారా ప్రభుత్వం నేరుగా రైతులకు సబ్సిడీపై విత్తనాలు సరఫరా చేస్తున్నామని మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు అన్నారు. పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ చిన్నబడాంలో ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీపై విత్తనాలను రైతులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ ప్రతినిధి దువ్వాడ రమణయ్య, వ్యవసాయశాఖ ఎఒ పోలారావు, ఎఇఒ పాపారావు, మాజీ కౌన్సిలర్ సంపతిరావు ధనుంజయ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మత్స్యకార సంఘ నాయకులు

మత్స్యకారులను ఎస్‌టిల్లో చేర్చాలి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

మత్స్యకారులను ఎస్‌టి జాబితాలో చేర్చాలని, లేకుంటే రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వైసిపికి తగిన గుణపాఠం చెబుతామని మత్స్యకార సంఘం జిల్లా మాజీ అధ్యక్షులు మైలపల్లి నర్సింగరావు స్పష్టం చేశారు. నగరంలోని ఎన్‌జిఒ హోమ్‌లో మత్స్యకార సంఘ నాయకులతో గురువారం మాట్లాడారు. న్యాయసమ్మతమైన తమ కోర్కెల సాధనకు ఉద్యమిస్తే తప్పేంటని ప్రశ్నించారు. మత్స్య, పశుసంవర్ధకశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు మత్స్యకారులను ఎస్‌టిలో చేరిస్తామని హామీనిచ్చారని, ఇప్పుడు ముఖం చాటేస్తున్నారని విమర్శించారు. జిల్లాలో 192 కిలోమీటర్ల మేర సుదీర్ఘ సముద్ర తీరం వెంబడి 104 మత్స్యకార గ్రామాలు ఉన్నాయని, వీరికి తెప్పలు, వలలు సైతం అందించలేదని తెలిపారు. రణస్థలం వైస్ ఎంపిపి దుమ్ము అశోక్ మాట్లాడుతూ గతంలో మత్స్యకారులను ఎస్‌టిలో చేర్చాలని 76 రోజుల పాటు ధర్నాలు, నిరసనలు చేశామన్నారు. అయితే ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. సమావేశంలో రాష్ట్ర మాజీ డైరక్టర్ మైలపల్లి త్రినాథరావు, మత్స్యకార జిల్లా ఎస్‌టి సాధన సమితి కన్వీనర్ చీకటి శ్రీరాములు, కుందు రాజశేఖర్, మోస ఫాల్గుణరావు, మాజీ సర్పంచ్ వారధి ఎర్రయ్య పాల్గొన్నారు.

కార్యదర్శులతో సమీక్షిస్తున్న రమణ

పారిశుధ్య పనులపై ప్రత్యేక దృష్టి

టెక్కలి: ఎండల తీవ్రత తగ్గి వర్షాలు ఆరంభం కానున్న దృష్ట్యా గ్రామాల్లో అంటువ్యాధులు ప్రబలకుండా పంచాయతీ ఆధికారులు ముందస్తు చర్యల్లో పారిశుధ్య నివారణ చర్యలు చేపట్టాలని టెక్కలి డివిజన్ పంచాయతీ విస్తరణాధికారి ఐ.వి.రమణ సూచించారు. తన కార్యాలయంలో టెక్కలి, పలాస డివిజన్‌లోని పంచాయతీ అధికారులతో, కార్యదర్శులతో గురువారం సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పంచాయతీల పరిధిలోని గ్రామాలను పర్యవేక్షించాలన్నారు. కాలువల్లో పూడిక త పనులు చేపట్టి బావుల్లో క్లోరినేషన్ పనులు చేపట్టాలన్నారు. తాగునీటి ట్యాంకులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ... వాటిని శుభ్రం చేయాలన్నారు. వ్యాధులు, అంటు రోగాలు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలన్నారు. పంచాయతీల వారీగా ఉన్న పన్నులను ముమ్మరం చేసి లక్ష్యాలను పూర్తి చేయాలన్నారు. పంచాయతీలు ఆర్థికంగా ఎదుగేందుకు కావాల్సిన మార్గాలను అన్వేషించాలన్నారు.

మాట్లాడుతున్న ఎపిఎం మల్లేశ్వరరావు

ప్రతి నెలా సమావేశాలు నిర్వహించాలి

పలాస: గ్రామాల్లో పంచాయతీ విఓ పరిధిలో ప్రతినెలా డ్వాక్రా సంఘాలతో సమావేశం నిర్వహించాలని, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై మహిళలకు అవగాహన కల్పించాలని వెలుగు ఎపిఎం మల్లేశ్వరరావు సూచించారు. స్థానిక స్త్రీ నిధి భవనంలో వెలుగు సిసిలతో, సిఎఫ్‌లతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ డ్వాక్రా సంఘాలకు బ్యాంకుల ద్వారా రుణాల మంజూరు చేయడంతో పాటు స్త్రీ నిధి, సిఎఫ్‌ఎంఎస్ రుణాలు అందేలా చూడాలన్నారు. తీసుకున్న రుణాలు సకాలంలో తిరిగి చెల్లించే విధంగా సిఎఫ్‌లు బాధ్యతగా పనిచేయాలనానరు. విఒ పరిధిలో సంఘాలకు ఇస్తున్న రుణాలు, చెల్లింపులు ప్రతి వాటినీ రికార్డుల్లో తప్పనిసరిగా నమోదు చేయాలన్నారు. ప్రతినెలా నమోదు చేసిన రికార్డులపై ఆడిట్ నిర్వహించాలన్నారు. సమావేశంలో ఎపిఎం అప్పల నర్సమ్మ, సిసిలు వెంకటేశ్వరరావు, నాగమ్మ, రేణుక, కళ్యాణి పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరా నిలుపుదల

కవిటి: మండలంలోని సిలాగాం ఫీడర్ పరిధిలో శుక్రవారం ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఇఇ ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. చెట్ల కొమ్మలు కత్తిరింపులో భాగంగా 11 కెవి ఫీడర్‌లోని సహలాలపుట్టుగ, కొజ్జిరి, ఆర్.కరాపాడు, బెలగాం, గొర్లేపాడు సచివాలయాల పరిధిలోని గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నామని అన్నారు. ఈ విషయాన్ని గమనించి వినియోగదారులు సహకరించాలని కోరారు.

నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

ప్రజాశక్తి- పలాస

రోడ్డు నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని, ఇష్టానుసారంగా రోడ్డు పనులు చేపడితే బిల్లులు చెల్లించడం కుదరదని మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు కాంట్రాక్టర్లకు హెచ్చరించారు. మున్సిపాలిటీ పరిధిలోని పెసరపాడు, అంతరకుడ్డ కలుపుతూ మున్సిపల్ జనరల్ ఫండ్, 15వ ఆర్థిక సహాయం నిధులతో నిర్మాణం చేపడుతున్న తారు రోడ్డు పనులను గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తారు రోడ్డు పనులు ఎంత వరకు చేపట్టారు, ఇంకా ఎంత శాతం పనులు చేయాల్సి ఉంది తదితర అంశాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పెసరపాడు గ్రామ సమీపంలో తారు రోడ్డు పనుల్లో భాగంగా పంట భూములకు వెళ్లాల్సిన సాగునీరు కాలువ పాడైందని, ఖరీఫ్ సమయంలో సాగునీరు కోసం ఇబ్బంది తప్పదని, వాటిని తక్షణమే బాగుచేసి పంట భూములకు

రోడ్డు పనులను పరిశీలిస్తున్న చైర్మన్ గిరిబాబు

సాగునీరు అందేలా చర్యలు చేపట్టాలని ఆ ప్రాంత రైతులు చైర్మన్ దీష్టికి తీసుకెళ్లారు. దీనిపై చైర్మన్ స్పందిస్తూ ఖరీఫ్ నాటికి కాలువ పనులు చేపట్టి సాగునీరు అందేలా చూస్తామని హామీ ఇచ్చారు. ఆయనతో పాటు మున్సిపల్ కమిషనర్ నాగేంద్ర కుమార్, వైస్ చైర్మన్ మీసాల సురేష్‌బాబు, కౌన్సిలర్ ప్రతినిధి దువ్వాడ రమణయ్య, కో-ఆప్షన్ సభ్యులు రోణంకి శ్రీనివాసరావు, మొదలవలస మన్మథరావు పాల్గొన్నారు.

'నాడు-నేడు' పనులు వేగవంతం

ప్రజాశక్తి- పలాస

ప్రభుత్వ పాఠశాలలో మౌలిక సదుపాయాలు, అభివృద్ధి కోసం గతేడాది రూ.16 కోట్ల వ్యయంతో నాడు-నేడు పనులు చేపడుతున్నామని, పనులు వేగవంతం చేయాలని ఎంఇఒ సిహెచ్.శ్రీనివాసరావు సూచించారు. స్థానిక సమీకృత విద్యావనరుల కేంద్రంలో సచివాలయం ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో గురువారం సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నాడు-నేడు మొదటి విడత రూ.8 కోట్లతో 23 పాఠశాలలు, రెండో విడత రూ.16 కోట్ల వ్యయంతో 47 పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాలు, జూనియర్ కళాశాలలో పనులు చేపట్టేందుకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందని చెప్పారు. పనులను త్వరగా పూర్తి చేసి పాఠశాలలో తరగతుల నిర్వహణకు అందించాలన్నారు. మొదటి దశలో ఇంకా ఏమైనా పనులు పెండింగ్‌లో ఉంటే మరుగుదొడ్లు, బెంచీలు, తాగునీరు, వంటశాలలు

సమీక్షిస్తున్న ఎంఇఒ శ్రీనివాసరావు

అవసరమైతే వాటిని నాడు-నేడు ఫేజ్-2ఎ నిధులతో పనులు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. అందుకు ప్రతి పాఠశాలనూ సందర్శించి పాఠశాల అవసరాల వివరాలను తమ కార్యాలయానికి త్వరగా అందజేయాలని సూచించారు. సమావేశంలో నాడు-నేడు ఎఒ ఆర్.రాజేంద్రరెడ్డి, సచివాలయం ఉద్యోగులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేస్తున్న ఉపాధ్యాయులు

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి- టెక్కలి

ఉపాధ్యాయ బదిలీ అనంతరం ఏర్పడిన కొత్త సమస్యలను పరిష్కరించాలని డిటిఎఫ్ జిల్లాశాఖ అధ్యక్ష, కార్యదర్శులు పేడాడ కృష్ణారావు, కొమ్ము అప్పలరాజులు కోరారు. ఈ మేరకు జిల్లా కేంద్రంలోని డిఇఒ డాక్టర్ టి.తిరుమలచైతన్యను గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రీ అపోర్షన్ ట్రాన్స్‌ఫర్ జిఒ 117 ప్రాప్తికి రాష్ట్ర ఖజానా శాఖ పాలనా అనుమతులు ఉండాలన్నారు. కానీ, ఇప్పటి వరకు అటు వంటి ఆనుమతులు లేవన్నారు. దీనివల్ల బదిలీ అయిన ఉపాధ్యాయుల జీతాల మంజూరులో సిఎఫ్‌ఎంఎస్‌లో ఆటంకాలు ఎదురవుతున్నాయని అన్నారు. దీంతో జిల్లాలో 15 వందల మంది ఉపాధ్యాయులు ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. రేషన్‌లైజేషన్‌లో పోయిన ఖాళీలను విద్యాశాఖ వెబ్‌సైట్‌లో చూపడం వల్ల బదిలీ అయిన ఉపాధ్యాయుల పరిస్థితి గందరగోళంగా ఉందన్నారు. పిజి హెచ్‌ఎంలుగా ఉన్న 250 మంది ఉపాధ్యాయులు జీతాలకు పెట్టుకునే పరిస్థితి లేదన్నారు. దీంతో పాటు పదో తరగతి విద్యార్థులకు టిసిలు మంజూరు చేయలేని పరిస్థితి ఉందని తెలిపారు. ఉద్యోగోన్నతులపై ఎంఇఒ-2గా వెళ్లిన పాఠశాలల్లో ఖాళీగా ఉన్న 35 మంది ఉపాధ్యాయులను ఆయా పాఠశాలల్లో భర్తీ చేయలేదని, అక్కడ ఉపాధ్యాయులకు జీతాలు బిల్లులు పెట్టుకోలేని పరిస్థితి ఉందని అన్నారు. వీటిపై తక్షణమే స్పందించి సమస్యలు పరిష్కారానికి చొరవ చూపాలని కోరారు. వీటిపై స్పందించిన డిఇఒ సాంకేతిక పరంగా ఉన్న ఇబ్బందులు తొలగించి సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తానని మాటిచ్చినట్లు తెలిపారు. వీరితో పాటు డిటిఎఫ్ గౌరవ అధ్యక్షులు కోత ధర్మారావు ఉన్నారు.

పొందూరు: ఈ నెల రెండో వారంలో నిర్వహించిన ఉపాధ్యాయుల బదిలీల అనంతరం ఏర్పడిన సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కొమ్ము అప్పలరాజు, పేడాడ కృష్ణారావు, జిల్లా కార్యదర్శి పూజారి హరిప్రసన్నలు ఒక ప్రకటనలో తెలిపారు.

కొబ్బరి తోటలో నవధాన్యాలను వేస్తున్న రైతులు

నవధాన్యాలతో నేల సారవంతం

ప్రజాశక్తి- రణస్థలం

ప్రకృతి వ్యవసాయం చేస్తున్న ప్రతి రైతూ నవధాన్యాలు సాగుపై దృష్టి సారించాలని యూనిట్ ఇన్‌ఛార్జి గంట్యాడ ఏసుబాబు రైతులకు సూచించారు. మండలంలోని ఉప్పువలసలో పప్పుల భాస్కరరావు 25 ఎకరాలు కొబ్బరి తోటలో 30 రకాల నవధాన్యాలను నేల సారవంతం నిమిత్తం గురువారం వేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నవధాన్యాలు వేయడం వల్ల నేల జీవవైవిధ్యం పెరుగుతుందన్నారు. నేలలో సేంద్రీయ కర్బన శాతం పెరుగుతుందన్నారు. అలాగే నేల గుల్ల బారుతుందని పేర్కొన్నారు. వానపాములు వృద్ధి చెందుతాయని తెలిపారు. పశువులకు పచ్చ గడ్డి మేత లభిస్తుందన్నారు. భూమిలోని అన్ని పోషకాలు సమృద్ధిగా ఉండి ప్రధాన పంటకు కావాల్సిన సారవంతం దొరుకుతుందన్నారు. కార్యక్రమంలో కార్యకర్తలు గంట్యాడ రమణమ్మ, గంట్యాడ సూర్యం, లంక సుజాత పాల్గొన్నారు.

పుష్కరిణి పునరుద్ధరణ పనులు పరిశీలన

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

అరసవల్లి సూర్యనారాయణ స్వామి దేవస్థానం పరిధిలోని ఇంద్ర పుష్కరిణి పునరుద్ధరణ పనులను దేవాదాయశాఖ ఇఇ టి.దుర్గేష్‌కుమార్ గురువారం పరిశీలించారు. ముందుగా ఆలయాన్ని సందర్శించిన ఆయనను ఇఒ వి.హరిసూర్యప్రకాష్ జ్ఞాపికను అందజేశారు. పుష్కరణి చుట్టూ నిర్మించనున్న ప్లాట్ ఫారాలతో పాటు మధ్యలో అమర్చిన నిర్మాణాలు, ఇతర డిజైన్లను పరిశీలించిన పలు సూచనలు చేశారు. ఆయనతో పాటు దేవదాయ, ధర్మదాయ శాఖ విశాఖపట్నం డిప్యూటీ ఇంజినీర్ కె.కృష్ణ, అసిస్టెంట్ ఇంజినీర్ ఎ.వి.వి.శివప్రసాద్, శ్రీకాకుళం అసిస్టెంట్ ఇంజినీర్ టి.చందన పాల్గొన్నారు.

ఆడిట్ ఆర్‌డిడి సందర్శన

అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయాన్ని రాష్ట్ర ఆడిట్‌శాఖ రీజినల్ డిప్యూటీ డైరెక్టర్ పి.సీతారామారావు సందర్శించారు. ఆయనకు ఆలయ మర్యాదలతో ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ

పరిశీలిస్తున్న ఇఇ దుర్గేష్‌కుమార్

స్వాగతించారు. ఆలయంలో స్వామి వారికి నిర్వహించిన సేవల్లో పాల్గొన్న అనంతరం అనివేటి మండపంలో ఆయనకు జ్ఞాపికను ఆలయ ఇఒ వి.హరిసూర్యప్రకాష్ అందజేశారు. కార్యక్రమంలో ఆలయ సీనియర్ అసిస్టెంట్ కృష్ణమాచార్యులు, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

శంకుస్థాపన చేస్తున్న తిలక్

సకాలంలో సాగునీరు

ప్రజాశక్తి- నందిగాం

రైతులకు సకాలంలో సాగునీరు అందించేందుకు ప్రభుత్వం కృషిచేస్తుందని కళింగ కార్పొరేషన్ చైర్మన్ పేరాడ తిలక్, ఎంపిపి నడుపూరు శ్రీరామ్మూర్తి అన్నారు. నందిగాం పంచాయతీ పెంటూరులో పైప్ కల్వర్టు నిర్మాణ పనులకు గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతు సంక్షేమానికి సిఎం జగన్ దృష్టిసారించారని అన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ శివప్రసాద్, పిఎసిఎస్ అధ్యక్షులు కురమాన బాలకృష్ణారావు, సర్పంచ్ జాడ్యాడ జయరాం, ఎంపిటిసి ప్రతినిధి అంబోడి విష్ణు, మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితులు చిన్ని జోగారావు పాల్గొన్నారు.

భూసార పరీక్షలు తప్పనిసరి

మట్టి నమూనాలను సేకరిస్తున్న వ్యవసాయాధికారులు

రణస్థలం: ప్రతిరైతూ భూసార పరీక్షలు తప్పనిసరిగా చేసుకోవాలని విఎఎం సునీత పేర్కొన్నారు. రణస్థలంలో మట్టి నమూనా సేకరణపై గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మట్టిలో ఉండే భూసారాన్ని తెలుసుకోవడం ముఖ్యమని చెప్పారు. దీనివల్ల మట్టిలో ఎంత సారం ఉందనేది తెలుస్తుందన్నారు. పొలంలోని మట్టిలో ఎక్కువ భూసారం ఉంటే ఎరువులు, ఎక్కువ వాడాల్సిన అవసరం ఉండదని తెలిపారు. మట్టిలో భూసారం ఉండటం వల్ల పంట దిగుబడి బాగా వస్తుందన్నారు. ఎరువుల ఖర్చు కూడా చాలా తగ్గుతుందన్నారు. భూసారాన్ని బట్టి ఏ పంట వేస్తే ఎక్కువ దిగుబడి వస్తుందనేది తెలుస్తోందన్నారు. మాస్టర్ ట్రైనర్ కంబపు కృష్ణ మాట్లాడుతూ రైతులు ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో నవధాన్యాలను, ఘనజీవామృతం వేసి ప్రధాన పంటను నాటుకోవడం వల్ల మొక్కకు కావాల్సిన పోషకాలు సమృద్ధిగా అందుతాయని అన్నారు. కార్యక్రమంలో గ్రామ కార్యకర్తలు కేలం లక్ష్మి, గడ్డపు రమణమ్మ, గులివెందుల జ్యోతి, గులివెందుల సురేష్ పాల్గొన్నారు.

పలువురికి ఆర్థికసాయం

టెక్కలి : టెక్కలికి సంతోష్‌కుమార్ రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్నాడు. దీంతో వైద్య ఖర్చులకు ఇబ్బందులు పడుతున్నాడు. విషయం తెలుసుకున్న అమ్మ హెల్పింగ్ హండ్స్ వైద్య ఖర్చులకు రూ.20 వేలు నగదును గురువారం అందజేశామని సొసైటీ అధ్యక్షులు ఉదయ్‌సాగర్ తెలిపారు. విశాఖపట్నంలో చికిత్స పొందుతున్న సంతోష్‌కుమార్‌కి ఆపరేషన్‌కు రూ.5 లక్షలు ఖర్చు అవుతుందని వైద్యులు తెలిపారని, దీంతో అసోసియేషన్ తరుపున సహకారం అందించామని తెలిపారు. కార్యక్రమంలో సంఘ సభ్యులు దామోదర్, శరత్, రవి, సంతోష్ పాల్గొన్నారు.

శ్రీకాకుళం అర్బన్ : ఆరోగ్యశ్రీ విభాగంలో

టెక్కలి : ఆర్థికసాయం అందజేస్తున్న సభ్యులు

ఆరోగ్యమిత్రగా పనిచేస్తూ అనారోగ్యంతో బాధపడుతున్న దివికాల శ్రీనివాసరావుకు ఆ విభాగం సిబ్బంది రూ.10 వేలు ఆర్థిక సాయాన్ని అందజేశారు. ఆరోగ్యశ్రీ జిల్లా కో-ఆర్డినేటర్ డాక్టర్ పాగిరి ప్రకాశరావుతో సిబ్బంది ఆయన ఇంటికి వెళ్లి పరామర్శించి చెక్కును అందజేశారు. కార్యక్రమంలో ఆరోగ్యమిత్ర అలికాన రాజారావు పాల్గొన్నారు.

జెవికె కిట్లు పంపిణీ

మెళియాపుట్టి : మండలంలోని చీపురుపల్లి, నందవ ప్రాథమిక పాఠశాలల్లో జగనన్న విద్యా కానుక కిట్లను వైస్ ఎంపిపి ఎస్.ఆదినాయుడు గురువారం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జగనన్న తల్లిదండ్రులకు భారం లేకుండా విద్యార్థినీ విద్యార్థులకు తన సొంత పిల్లలుగా భావించి స్కూల్ బ్యాగ్స్, పుస్తకాలు, షూ, టై, యూనిఫారాలు, నోటు పుస్తకాలను అందజేస్తున్నారన్నారు. ప్రయివేటు స్కూళ్లకు ధీటుగా ప్రభుత్వ స్కూళ్లలో రూపురేఖలు నాడు -నేడు ద్వారా మారాయన్నారు. కార్యక్రమంలో చీపురుపల్లి, పరశు రాపురం, ఇళయపురం సర్పంచ్‌లు ఈశ్వరరావు, ప్రసాదరావు, ఎస్.గౌరీస్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు తవిటినాయుడు, అరుణ స్కూల్ కమిటీ చైర్మన్లు వెంకటరావు, ఈశ్వరి పాల్గొన్నారు.

ట్రై సైకిల్ పంపిణీ

నందిగాం: మండలంలోని హర్షబాడకు చెందిన జొన్న హిమగిరి అనే వికలాంగ విద్యార్థికి ట్రై సైకిల్‌ను ఎంపిపి నడుపూరు శ్రీరామ్మూర్తి గురువారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపిడిఒ శివప్రసాద్, ఎంఇఒ నరసింహులు, పి.ఆనందరావు, ఐఇడి ఉపాధ్యాయుని పినకాన రాణి పాల్గొన్నారు.

రేపు విశ్రాంత ఉద్యోగుల సమావేశం

టెక్కలి రూరల్ : టెక్కలి సబ్ ట్రెజరీ పరిధిలోని నందిగాం, సంతబొమ్మాళి, టెక్కలి మండలాల విశ్రాంతి ఉద్యోగుల సమావేశం ఈ నెల 24న నిర్వహిస్తున్నట్లు విశ్రాంతి ఉద్యోగుల సంఘం అధ్యక్షులు రోణంకి రామచంద్రరావు ఒక ప్రకటనలో తెలిపారు. విశ్రాంతి ఉద్యోగులందరూ ఇన్కమ్ టాక్స్, ఇకెవైసి, పాన్ కార్డతో ఆధార్ కార్డు లింకు, ఆధార్ అప్‌డేట్ తదితర విషయాలపై చర్చిస్తామని అన్నారు. మూడు మండలాల విశ్రాంత ఉద్యోగులు పాల్గొవాలని కోరారు.

డిగ్రీ కళాశాలలో కంప్యూటర్ ల్యాబ్

ఇచ్ఛాపురం : ఇచ్ఛాపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కొత్త కంప్యూటర్ లాబ్ ఏర్పాటు చేశామని ప్రిన్సిపాల్ డాక్టర్ రోబిన్ కుమార్ పాడి గురువారం తెలిపారు. రుసా నిధులతో డిగ్రీ కళాశాలకు కొత్తగా వచ్చిన 50 కంప్యూటర్లతో లాబ్ ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఇప్పటికే కళాశాలలో డిజిటల్ లాబ్, స్మార్ట్ క్లాస్ రూమ్‌లు ఉన్నాయని చెప్పారు. దీంతో పాటు అదనంగా వచ్చిన కొత్త కంప్యూటర్ విద్యార్థులకు మంచి అవకాశమని, దీనిని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.

కంప్యూటర్ ల్యాబ్